క్లుప్తంగా

ఘనంగా మహాసామ్రాట్ అశోక చక్రవర్తి జయంతి


అశోకుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మహాసామ్రాట్ అశోక జయంతిని శనివారం స్థానిక నరసింహరావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో సామాజిక కార్యకర్త మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అశోక చక్రవర్తి దేశవ్యాప్తంగా బౌద్ధాలయాలు నిర్మించారని, ధర్మచక్రాన్ని 24 ఆకులతో నిర్మించారని సంతోష్ కుమార్ గుర్తుచేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్ఎడీ పాల్ మాట్లాడుతూ ప్రజల యోగక్షేమాలే ధ్యేయంగా అశోకుడు పాలన అందించారని తెలిపారు. మాల ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ మౌర్య వంశానికి చెందిన అశోకునికి ప్రపంచ చరిత్రలో ప్రత్యేకత ఉందని తెలిపారు. కార్యక్రమంలో నూకపెయ్యి కార్తీక్, దాసరి శ్యాం, గొల్ల కిరణ్, మాజీ ఎంపీపీ కె.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవార్డు గ్రహీతలకు సన్మానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక హిందూ యువజన సంఘం 121 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఇటీవల ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ అవార్డులు పొందిన కళాకారులకు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం సాయంత్రం సన్మానించనున్నట్టు హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ముందు శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొంటారని తెలిపారు.

వ్యాధులపై అవగాహన

గణపవరం: దోమకాటు వల్ల అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తాడేపల్లిగూడెం యూనిట్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శనివారం గణపవరంలోని జగన్నాథపురంలో కీటకజనిత వ్యాధులు, వారంలో ఒకరోజు డ్రైడే, దోమల వ్యాప్తి, దోమలకాటు వల్ల వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటినిల్వలు ఎక్కడున్నా దోమలు వృద్ధి చెందుతాయని, నీటి తొట్టెలను వారం వారం శుభ్రం చేయాలని, దోమల లార్వాను నిర్మూలించి దోమల సంతతి వృద్ధి చెందకుండా చూసుకోవాలని లక్ష్మణరావు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సాధారణ జ్వరమైనా ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నత్తే నయం

- మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల్లో పురోగతి నిల్
- కూటమి సర్కారు ఆధీనంలోనే కాలేజీ నడిచేనా?

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికే తలమానికంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేయించి, ఆగమేఘాలపై ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏలూరు నగరానికి తెచ్చారు. యుద్ధప్రాతిపదికన ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఆధునిక సౌకర్యాలతో మెడికల్ కాలేజీ భవనాన్ని నిర్మించి 2023 సెప్టెంబర్ 2న ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారు. కానీ ఏలూరు జీజీహెచ్‌లో నిర్మించాల్సిన శాశ్వత మెడికల్ కాలేజీ భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కూటమి సర్కారు హయాంలో ఏనాటికి ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తారో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ తీరుపై ఏలూరు నగర ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కాలేజీ

ఏలూరు నగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటై రెండేళ్లయింది. రెండో ఏడాది ఎంబీబీఎస్ తరగతులు సైతం నడుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి రూ.525 కోట్లు వెచ్చించేలా చర్యలు చేపట్టారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని 23 ఎకరాల్లో శాశ్వత మెడికల్ కాలేజీ భవనం, వైద్య విద్యార్థులకు సకల సౌకర్యాలతో హాస్టల్స్ భవనాలు, అత్యాధునిక వైద్య సేవలతో కూడిన బోధనాసుపత్రి భవనం, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు నిర్మించాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కాలేజీ నిర్వహణ ఉండేలా చర్యలు చేపట్టారు.

ప్రభుత్వమే నిర్వహిస్తుందా ?

కూటమి పార్టీలు అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణం పనులు సా..గుతూ ఉన్నాయి. 2.70 లక్షల చదరపు గజాల విస్తీర్ణంలో సుమారు రూ.80 కోట్లతో భవనం నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్ల ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు సకల సౌకర్యాలు, అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్స్ వంటివి ఈ భవనంలో ఏర్పాటు చేయాల్సింది. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే యోచనలో ఉండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. శాశ్వత భవన నిర్మాణాన్ని కావాలనే ప్రభుత్వం జాప్యం చేస్తుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో శాశ్వత ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణం

ప్రైవేటు పరం సరికాదు



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏపీ ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలి. కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ఆలోచన ఉంటే విరమించుకోవాలి. శాశ్వత భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వైద్య విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. మూడో సంవత్సరం తరగతులు ప్రారంభం నాటికైనా అన్ని సౌకర్యాలతో వైద్య విద్య అభ్యసించేలా చర్యలు తీసుకోవాలి.

– కాకి నాని, జిల్లా అధ్యక్షుడు, పీడీఎస్‌యూ

వైఎస్సార్ సీపీ ఘనతే



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మేరకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి చూపించారు. ఏలూరు నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మెడికల్ కాలేజీ స్థాపించారు. కూటమి ప్రభుత్వం హయాంలో నిర్మాణ పనులు నెమ్మదించాయి. వేగంగా భవనాల నిర్మాణాలు పూర్తి చేసి, వైద్య విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి.

– పాతినవలస రాజేష్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం

శనివారపుపేట విద్యార్థులకు పతకాలు


చిత్రలేఖనంలో పతకాలు సాధించిన విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. విజయవాడకు చెందిన డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ ఇటీవల నిర్వహించిన 12వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో శనివారపు పేట పాఠశాల విద్యార్థులు ఆర్ సాయి కీర్తన, సీహెచ్ వైష్ణవి, తేజస్వి, సీహెచ్ యతిక్ రత్న, ఎ.నాగరాజు బంగారు, సీహెచ్ జ్యోత్స్న, ఆర్ రూత్‌రాయ్ గ్రేస్‌లు రజత పతకాలను సాధించారు. వీరికి విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డ్రీమ్‌వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ సంస్థ ఫౌండర్ పి.రమేష్ పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను, ఆర్ట్ టీచర్ ఎండీ ఇర్షాద్ అహ్మద్‌ను శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ రావు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రాములోరి పెళ్లికి ఆలయాల ముస్తాబు


40వ డివిజన్ రామ మందిరంలో స్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు


కొత్తపేట శ్రీరామ మందిరం


ఆర్ఆర్‌పేట కోదండ రామాలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆదివారం శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏలూరు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగులు వేశారు. ఆలయాల వద్ద చలువ, టిప్‌టాప్ పందిళ్లు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమీనాపేటలోని రిజర్వ్ పోలీస్‌లైన్‌లోని దాసాంజనేయస్వామి ఆలయంలో మధ్యాహ్నం 12.05 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి నిర్వహించనున్నారు. అనంతరం సీతారాముల ఊరేగింపు ఉంటుంది. విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో అమీనాపేట విద్యుత్ రామాలయంలో 20వ వార్షిక సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. పవర్ పేట బడేటి వారి వీధి కోదండ రామాలయంలో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. రామచంద్రరావు పేట సుబ్బమ్మ దేవి స్కూల్ రోడ్డులోని కోదండ రామాలయం, దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రం, నరసింహరావు పేట షిర్డీ సాయి మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

- 40వ డివిజన్‌లో ఫ్రెండ్స్ యూనిటీ సెంటర్ వద్ద శ్రీరామ మందిరంలో భద్రాద్రి సీతారామ స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం 6 గంటలకు ఎదుర్కోలు, తాంబూలాదుల ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీవారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం, సాయంత్రం 7 గంటల నుంచి రథోత్సవం నిర్వహించనున్నారు. 7వ తేదీన వసంతోత్సవం, చక్రవారి, సాయంత్రం శ్రీపుష్పయాగం, రాత్రి ఊంజల్ సేవ ఉంటుంది.

డాక్టర్ జగదీష్ చంద్రప్రసాద్ మృతి


డాక్టర్ చంద్రప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జేపీ, నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రముఖ వైద్యులు, ప్రభావతి హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ మైనేని జగదీష్ చంద్రప్రసాద్ మృతి చెందారు. ఆర్ఆర్‌పేటలోని అయన స్వగృహం వద్ద భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీష్ చంద్రప్రసాద్ ఏలూరులో సుమారు ఐదు దశాబ్దాలుగా వైద్యవృత్తిలో ఆయన సతీమణితో కలిసి ప్రజలకు విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. జయప్రకాష్ వెంట నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవి, మున్నుల జాన్‌గురునాథ్, కిలాడి దుర్గారావు ఉన్నారు.

నేడు రైతుల మహాధర్నా

గణపవరం: రొయ్య సాగులో ఇప్పుడున్నంత సంక్షోభం ఇంతకు ముందెన్నడూ చూడలేదని రొయ్యల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేతలు, మందులు, నిర్వహణ ధరలు విపరీతంగా పెరిగిపోగా, రొయ్యల ధర మాత్రం పాతాళానికి పడిపోయిందని వాపోతున్నారు. తమను ఆదుకోవాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే పరిస్థితులు లేవని రోడ్డెక్కుతున్నారు. అమెరికా ఆంక్షల ఫలితంగా ఒక్కసారిగా రొయ్యల ధర పడిపోవడంతో ఆక్వా రైతులకు నోట మాట రావడంలేదు. కిలోకు రూ.5 లేక రూ.10 తగ్గితేనే గగ్గోలు పెట్టే రైతులు ఒక్కసారిగా కిలో రొయ్యల ధర రూ.30 నుంచి రూ.40 వరకు పడిపోవడం వ్యాపారుల మాయాజాలమేనని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఎక్కడికక్కడ పట్టుబడులు నిలిపివేసి న్యాయం కోసం రోడ్లపైకి వస్తున్నారు. గణపవరం ఏరియాలో ఆక్వా సాగు చేస్తున్న రైతులంతా ఈనెల 6న గణపవరం పోలీస్ ఐలెండ్ సెంటర్‌లో మహాధర్నాకు సమాయత్త మవుతున్నారు. ఇప్పటికే గణపవరం, నిడమర్రు, ఉండి, ఆకివీడు, ఉంగుటూరు, పెంటపాడు మండలాలకు చెందిన రొయ్య రైతులంతా ధర్నాలో పాల్గొనాలని సంఘం నాయకులు కోరారు.

దీన జనోద్ధారకుడు జగ్జీవన్‌రామ్

ఘనంగా 118వ జయంతి


ఏలూరు టౌన్: గొల్లాయిగూడెంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్


ఏలూరు (టూటౌన్): డీడీఆర్‌సీ కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏడీ రామ్‌కుమార్

ఏలూరు టౌన్ : సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మాజీ ఉపప్రధాని దీన జనోద్ధారకునిగా స్ఫూర్తినిస్తారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏలూరు గొల్లాయిగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ కుల వివక్షత, అంటరానితనం రూపుమాపేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చూపిన బాటలో యువత నడుస్తూ సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, నెరుసు చిరంజీవి, మున్నుల జాన్‌గురునాథ్, జిజ్జువరపు విజయనిర్మల, కిలాడి దుర్గారావు, కొల్లిపాక సురేష్, మేతర సురేష్, గంటా రాజేశ్వరరావు, తులసీ, తులసీవర్మ, ఫణి, గంటా సాయిప్రదీప్, బండ్లమూడి సునీల్, సృజన్, వెంకటేష్, పూజిత్, బుర్ల రమేష్ తదితరులు ఉన్నారు.

సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు

సమసమాజ స్థాపనకు అవిరళకృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు కొనియాడారు. స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, సిబ్బందికి స్వీట్లు పంచారు. పంపిణీ చేశారు. ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు భాస్కరరావు, అమరేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, పరివర్తన్ బధిరుల పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషన్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.

- ఎస్సీ ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు ఎం అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి మానవత సంస్థ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు పూలమాలవేసి నివాళులర్పించారు.
- బీసీ సబ్ ప్లాన్, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కేవీపీఎస్ జిల్లా నాయకులు మంచెల్ల ఇస్సాక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. జగ్జీవన్ రామ్ సేవలను పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆది శేషు వివరించారు.
- దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, జిల్లా నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఫిలౌస్ పేటలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.
- బీజేపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన సేవలను జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ కొనియాడారు.
- జిల్లా నీటి యాజమాన్య సంస్థ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ భవన్లో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక విద్యుత్ భవన్లో జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. అణగారిన వర్గాలకు ఆయన చేసిన సేవలు మరువ లేనివని ఎస్ఈ పి.సాల్మన్ రాజు కొనియాడారు. ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుక నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.
- జిల్లా గ్రంథాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

దెందులూరు: జగ్జీవన్ రామ్ దేశానికి ఆదర్శప్రాయుడని ఎంపీడీఓ శ్రీలత, డ్వామా కార్యాలయం అధికారి కిషోర్ అన్నారు. ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

సగర్ల సంక్షేమం, అభివృద్ధికి కృషి


ఆంజనేయులును సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సగర్ల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని సగర సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక జీహెచ్‌డీ ఎంపైర్‌లో నిర్వహించిన సగర సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. సగర్లు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపీరావు మాట్లాడుతూ సగర్లకిచ్చే కుల ధ్రువీకరణ పత్రాల్లో సగర (ఉప్పర) అని ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగర్లకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, అన్ని ఎన్నికల్లో సగల్లకు కొన్ని సీట్లను అన్ని రాజకీయ పార్టీలు కేటాయించి, తమ రాజకీయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సగర సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

సంఘం జిల్లా అధ్యక్షుడిగా కుప్పాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా తాడిశెట్టి శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా గండికోట సీతారామరాజు, కోశాధికారిగా తాడిశెట్టి శివయ్య, జిల్లా యువజన అధ్యక్షుడిగా ఇబ్బా నాగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా గాదె వెంకట రమణ, ఏలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా కగ్గా ప్రసాద్, యువజన అధ్యక్షునిగా రెడ్డి రామకృష్ణ, గోపాలపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా దంగ్రు వీరపాండు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పరి సురేష్, కోశాధికారి జక్క అప్పారావు, సీనియర్ నాయకులు రెడ్డి రాంబాబు, గండికోట చిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

15లోగా పశుగణన పూర్తిచేయాలి

ద్వారకాతిరుమల: కేంద్ర ప్రభుత్వ సలహాదారు(గణాంకాలు) జగత్ హజారికా శనివారం చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగత్ హజారికా మాట్లాడుతూ పశుగణనను ఈ నెల 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టి.గోవిందరాజు, డాక్టర్ శ్రీనివాస రాజు, చందు, భీమడోలు ఏడీ డాక్టర్ సాయి రమేష్, డాక్టర్ హర్ష, ద్వారకాతిరుమల మండలం పశు వైద్యాధికారి అంగర సురేష్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	54
వంకాయలు (కాంతులు)	26	బీన్లచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	26	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	76
కాకర కాయలు	30-36	బీట్‌రూట్	30
బీరకాయలు	28	కీరా దోస	30
బీరకాయలు (పందిరి)	34	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	13
ఏలూరు - జేడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	06
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	09
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	11
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	07
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	34